# చెవిటిమేళం!

వయసు మీదపడేకొద్దీ వినికిడి శక్తి తగ్గటం ఆ వయసువారికి దేవుడిచ్చే వరం అంటాడు నాఫ్రెండ్ నందనరావ్.

నందనరావ్‌కి డబ్బుకేం కొదవలేదు. కావలసినంత ఎరన్ చేసాడు. అఫ్‌కోర్స్... (ఏ కోర్స్?) అంతా కష్టార్జితమే! అయాచితంగా వచ్చిపడింది కానేకాదు.

టాక్స్‌కన్సల్టెంట్‌గా కెరీర్ ప్రారంభించిన నందనరావ్... షష్టిపూర్తి నాటికి లెక్కలేనంత ఆర్జించి (ఆర్జించటమేంటి విసర్జించటం లాగ అని నవ్వుకోకండి) ... మానసిక ఒత్తిడికి తట్టుకోలేక... వారసత్వపు హక్కుగా... తన ప్రాక్టీసు కొడుక్కి టోటల్‌గా అప్పగించి ఇకపై రెస్టే బెస్ట్ అనుకున్నాడు.

నందనరావ్ కొడుకు చాలా బుద్ధిమంతుడు! హాస్టల్లో వుంటూ... హోటల్లో తింటూ... అయిదేళ్ళపాటు చెన్నైలో సి.ఏ. చదివి... గోల్డ్‌మెడల్ సంపాదించుకున్నాడు.

తనకొడుకు భరత్ ప్రయోజకుడై తన వారసత్వ సంపదను... వృత్తినీ... అబ్బుకున్నందుకు లోలోపల కించిత్ గర్వపడుతూ వుంటాడు.

భరత్ చిన్నప్పుడు... బడుద్ధాయిలా... జులాయిగా స్కూలు ఎగ్గొట్టి... మేట్నీషోలకని... క్రికెట్ మ్యాచ్‌లనీ తిరిగినా.. నందనరావ్ కొడుకుని పల్లెత్తుమాట అనేవాడుకాదు.

తన పర్స్‌లో డబ్బు తస్కరించుకెళ్ళి ఫ్రెండ్స్‌తో జల్సా చేసుకుంటున్నాడనే వార్త చెవిన పడ్డా... లక్ష్యపెట్టలేదు.

ప్రతి చిన్న విషయానికీ మందలిన్తాంటే ఒక్కగానొక్కడైన భరత్ మానసికంగా దెబ్బతినగలడనే శంకతో... కొడుకు కొరగాకుండా పోతాడేమోనే భయంతో... నోరు మెదిపేవాడు కాదు నందనరావ్.

భార్య ప్రత్యూష కొడుకు చెడు సావాసాలు మరిగాడని నందనరావ్‌తో చెవిలో జోరీగై మొత్తుకున్నా నవ్వి వూరుకోవటానికి అలవాటుపడ్డాడు.

నందనరావ్ మౌనానికి ముఖ్య కారణం... అతనొక్కడికే తెలుసు... అతను జ్యోతిష్యశాస్త్రాన్ని క్షుణ్ణంగ అధ్యయనం చేసినవాడు కావటంతో... కొడుక్కి పద్నాలుగేళ్ళ వరకూ గ్రహవీక్షణం బాగుండదని... అటుపై పిల్లవాడు లక్షణంగా విద్యావంతుడౌతాడనే విషయం ... కొడుకు పుట్టగానే తాను స్వయంగా తయారుచేసిన జాతకచక్రం వేసినవాడు కావటాన కొడుకు తప్పకుండా ప్రయోజకుడవుతాడనేది నందనరావ్‌లో వున్న ప్రగాఢ విశ్వాసం!

విషయం ప్రత్యూషతో వివరంగ చెప్పకుండా ఇబ్బందికి పిల్లవాడిని గురిచేసే గ్రహాలకు శాంతి చేయించటమూ జరిగింది.

ఎందుకైనా మంచిదని భరత్‌ని టెన్త్‌లో స్పెషల్ కోచింగ్ ఇప్పించిన కారణంగా... కష్టపడి చదివి స్కూలు ఫస్టొచ్చాడు. ఆ క్షణాన నందనరావ్ ఆనందానికి అంతేలేకుండా పోయింది.

అప్పటినుండి భరత్‌కి చదువుపట్ల శ్రద్ధ ఎక్కువైంది. అతని ఆశ శ్వాస చదువే అవటం మూలాన నేటికి సి.ఏ.లో గోల్డ్ మెడలిస్ట్ కాగలిగాడు.

★★★★★

నందనరావ్ షష్ఠిపూర్తి చేసుకున్న ఏడాదిలోపే భార్య ప్రత్యూష సడన్‌గ చనిపోవటం వల్ల మరువలేని దెబ్బే తగిలింది!

నా ప్రాణ స్నేహితుడిని ఓదార్చటం నావల్ల కాలేదు. ప్రత్యూష కన్నుమూసేలోపే భరత్ వివాహం కళ్ళారా చూచి ఆనందించగల అదృష్టవంతురాలైంది.

కొత్తకోడలు వచ్చాక తాను వంటింటి బాధ్యత నుండి విముక్తి పొందచ్చని సంబరపడుతున్న తరుణంలో మృత్యువు ఆమెను మింగేసింది!

పెళ్ళినాటికే భరత్ భార్య ఉద్యోగం చేస్తూ నెలకు అరవై వేలు సంపాదిస్తోంది. కోడలి తెలివితేటలు... సంపాదన చూస్తూ ఆమె ఉద్యోగం పెళ్ళి అయ్యాక మానెయ్యమనటానికి నందనరావ్ దంపతులకు మనసొప్పలేదు.

నిజానికి కోడలు ఉద్యోగంచేసి సంపాదించి సంసారాన్ని పోషించాల్సిన అవసరం లేనేలేదు. కాకపోతే... చదివిన చదువు వృథా పోనివ్వటం దేనికనేసి వుద్యోగం పెళ్ళి జరిగేక కొనసాగిస్తున్నా... నందనరావ్ అతని భార్య ప్రత్యూష నోరు మెదపలేని పరిస్థితైంది.

కోడలి వుద్యోగం పట్ల తమ విముఖత భరత్ అతని భార్యల మధ్య ఎలాంటి కలతలకు కారణమౌతుందోనే శంక మరోవేపు ముసలివారిని కలవరపెడుతోంది!

కంప్యూటర్ జాబ్ కావటంవల్ల కోడలు అనూష డ్యూటీపరంగా రాత్రిళ్ళు ఇంటికి రాని రోజులూ వుండటంతో నందనరావ్‌కి అతని శ్రీమతి ప్రత్యూషకి మనసులో బాధ అన్పించేది.

సుఖపడాల్సిన వయసులో ఈ వుద్యోగాలేమిటి చెప్మాని విస్తుపోవటం వారి వంతైంది!

పగటిపూటంతా భరత్ ఇంట్లో వుండడు. అనూష రాత్రి డ్యూటీ కెడుతుంది. మరలాంటప్పుడు... ఇద్దరూ కలుసుకుని ముచ్చట్లాడటానికే టైమ్ దొరకనప్పుడు... ఇక సంసారం ఏం చేస్తారు?

ఈ విషయంలో అనూషతో భరత్ తన భార్యతో గొడవపడడం పెద్దవాళ్ళు విన్నా జోక్యం

చేసుకోవటం తగదని మౌనం వహిస్తూ రాసాగేరు.

ఒకరిపై ఒకరు అధిపత్యం పోరుకి తలపడుతున్నారనే విషయం భరత్ పేరెంట్స్‌కి అర్థమైంది. అన్యోన్యం ఇద్దరిమధ్యా కొరవడిందనీ బోధపడుతోంది. హౌ టు సాల్వ్ ది ప్రాబ్లమ్? అనేదే ప్రశ్న?

రోజులు గడిచేకొద్దీ ఇంట్లో ఎవ్వరికీ మనశ్శాంతి లేకుండా పోతోంది!

ఈ కాలం పిల్లలింతే! నోటికొంతమాటొస్తే... అంతా అనేస్తారు. భర్త అనే గౌరవంగానీ... పెద్దవాళ్ళు ఇంట్లో వున్నారనే మర్యాదగానీ బొత్తిగా వుండటం లేదనే నిజం నందనరావ్‌కి బాగా తెల్సు!

అందుకే కొడుకు కోడలు విషయాల్లో తాను తలదూర్చదల్చుకోలేదు నందనరావ్!

ఇలా అయితే భార్య భర్తకి సేవలెప్పుడు చేసేట్టు?... అని ప్రత్యూష అన్న క్షణంలో...

నేటి సంసారాలింతే!... ఎవరికి వారే యమునా తీరే! అవగాహనరాహిత్యం! సంపాదించాలనే తపన... ఆరాటం తప్ప... అన్యోన్యం, ఆప్యాయతలు మృగ్యం... కాబట్టి నువ్ నోరు మెదపకు... అని ప్రత్యూష నోరు మూయించేవాడు నందనరావ్.

అన్నింటికీ తనకు అండగా... తోడుగా నీడగా వున్న ప్రత్యూష కాలం చేయటంతో వంటరితనం నందనరావ్‌ని పిరికివాడిని చేస్తోంది.

తన ఆత్మఘోష నాతో చెప్పుకుని కళ్ళనీళ్ళు పెట్టుకోని రోజంటూలేదు. ఇవన్నీ లేటు వయసులో వచ్చే కష్టాలే... అన్నింటికీ మనం సరిపెట్టుకోక తప్పదు. అని వాడికి నచ్చచెప్పటం... ధైర్యాన్ని నూరిపోయటం నా వంతైంది.

రోజులు గడిచేకొద్దీ అనూష విశ్వరూపం చూడాల్సిన ఖర్మ పట్టింది నందనరావ్‌కి.

చూపు మందగించటంతో కంటికి సోడాబుడ్డి అద్దాలొచ్చినయ్!... మరొకవైపు చెవుడొకటి!...

ఏదీ విన్పించి చావదు. ఇదీవకందుకు మంచిదే అన్పించేది అతగాడికి! తనను నిందించినా... అగౌరవపరుస్తూ కోడలు మాట్లాడినా... చివరికి నీచాతినీచంగా నోరుపారేసుకున్నా తనకేం పట్టదు. ఎంచేతంటే తనకు చెవుడు. ఎవరు ఏమన్నా... ఎన్నైనా... విన్పించదు కదా?!?...

కొడుకు హియరింగ్ ఎయిడ్ కొనిస్తానన్నా కావాలని తనే వద్దన్నాడు. అది వాడితే మైండ్ చెడిపోగలదని డాక్టర్లు అంటున్నారనేసి అబద్ధం ఆడి... అది పెట్టుకుంటే... కోడలిగారి దాష్టీకం ఎక్కడ వినాల్సి వస్తుందో... విన్నాక మనసు వుండబట్టలేక... తిరిగి తాను మాట జారతాడోనే భయం నందనరావ్‌ని పీకటంతో చెవిటి మిషన్ పెట్టుకోలేదు.

తాను ఉద్యోగం మానేసే ప్రసక్తే లేదని అనూష భర్తతో ఒకరోజున తెగేసి చెప్పింది.

"అన్నేళ్ళు... అంత కష్టపడి చదివింది... ఇంట్లో వుండి మీకు వంటచేసి పెట్టటానికీ కాదు... ఏడాదికో పురుడు పోసుకుంటూ మీకు పిల్లలను కనిపెట్టడానికీ కాదు మైడియర్ హజ్బెండ్?... అంతకాదూ కూడదని నన్ను కంపెల్ చేస్తే ... మీకు విడాకులైనా ఇస్తానేమోగాని... బంగారుబాతు లాంటి వుద్యోగాన్ని మీ స్వార్థ ప్రయోజనాలకోసం వదులుకోను!...' అంది అనూష.

కటువుగా మాట్లాడిన అనూష పరుష వాక్యాలు శూలాలై భరత్ గుండెను చీల్చినట్టన్పించింది.

'అవునే... రక్తం మరిగిన పులి... గడ్డి తింటుందనుకోవటం... నా ఫూలిష్‌నెస్!...' అవమాన భారంతో తల పట్టుకున్నాడు భరత్.

'ఇప్పుడేం తక్కువైందని నాతో ఘర్షణ పడటం?... సమయానికి వంటమనిషి కూడా మనకు దొరికె! ఇంటి కాపలాకు మీ డాడీ వున్నారాయె?... పొద్దుపోయేదాకా టీ.వీ. చూస్తూ వుండండి. కళ్ళుమూతలు పడగాను హాయిగా నిద్రపోండి... ఇంతకంటే ఏం కావాలి మీకు?...' దీర్ఘాలు తీసింది అనూష.

'అంతేనా!?... మనిషి బ్రతకటానికి ఇవి చాలా? కామన్‌సెన్స్ లేకుండా మాట్లాడకు?...'

'శృతి మించి వాగేది మీరు... మధ్య నామీద కేకలేస్తారేం?...' నొసలు చిట్లించింది.

'అదికాదు అనూ... నేను ఉదయం వెళ్ళి రాత్రి పదిగంటలకొస్తాను. నువ్వు రాత్రి ఎనిమిదింటికి ఆఫీసుకెళ్ళి తెల్లారి వస్తావు. ఒంటరిగా మా డాడీ వక్కడే ఇంట్లో వుంటే... ఎంత బాధగా వుంటుందో అండ్రస్టాండ్ చేసుకోవేం?...' భార్యకి నచ్చచెప్పే ప్రయత్నంతో మాట్లాడేడు భరత్.

'అంత తోచక బాధపడిపోతుంటే... మీ డాడీని ఎక్కడైనా ఓల్డేజ్‌హోంలో చేర్పించు! ప్రాబ్లమ్ సాల్వ్ అవుతుంది. అంతేగాని నన్ను జాబ్ మానేసి ఆయనకు తోడుగా ఇంట్లో వుండమనటం ఫూలిష్‌నెస్...'

అనూష కేర్‌లెస్‌గా మాట్లాడిన ధోరణికి ఆవేశపడిపోయిన భరత్ చేయి చేసుకున్నాడు.

ఇద్దరిమధ్యా ఘర్షణ పెరిగింది. తూలనాడుకోవటం పరాకాష్ఠకు చేరింది.

'వైఫ్‌మీద చేయిచేసుకోవటానికి నీకు సిగ్గుగా లేదూ?... మానవత్వం లేని బ్రూట్ నువ్వు?... నీలాంటి ఇడియట్‌కి భార్యగా వుండటం నా వల్లకాదు...' అని గబగబా పెట్టెలో గుడ్డలు సర్దుకుని రివ్వన ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది.

భరత్ దిగ్భ్రాంతికి లోనయ్యాడు. వద్దని ఎంత వారించినా వినకుండా వెళ్ళిపోయిన భార్య నిర్ణయానికి ఖిన్నుడైనాడు.

ఇంత జరిగినా నందనరావ్‌కి ఇవేమీ తెలీదు. ఆయన బెడ్‌రూమ్‌లో వుండి రాత్రి

పదిగంటలవేళ నిద్రరాక భాగవతం చదువుకుంటున్నాడు.

ఆ రాత్రి భరత్‌కు కంటిమీద కునుకులేదు. తెల్లవారేక రాత్రి జరిగినదంతా తండ్రికి చెప్పాలనే ప్రయత్నంలో వచ్చి కాఫీ తాగుతున్న డాడీకి ఎదురుగా కూర్చున్నాడు.

తెల్లవారిన తర్వాత కోడలు ఇంట్లో కన్పించకపోవటం... భరత్ ముఖంలో అశాంతి చోటుచేసుకుందనే విషయాన్ని నందనరావ్ పసికట్టాడు

భరత్ ఏదో చెప్పాలనే ప్రయత్నం చేస్తూండగానే... 'చూడు భరత్!... నీకు నీ వైఫ్ ముఖ్యం! నేను కాదు. జీవితకాలం కష్టమైనా సుఖమైనా భార్యాభర్తలిరువురూ అన్యోన్యంగా... సఖ్యతగా వుండటం... ఇరువురికీ మనశ్శాంతినిస్తుంది?... నన్ను మర్చిపో!... నా గురించి ఆలోచించటం మానెయ్!... నేనొక నిర్ణయానికొచ్చాను. నేను ఈ వయసులో మీకు భారం కాలేను. వంటరివాడిని... ఎక్కడున్నా నాకు రోజులు వెళ్ళిపోతయ్! నేను ఓల్డేజ్ హోంలో ఈరోజే నీతో చెప్పి జాయినవాలనుకుంటున్నాను. ప్రతి విషయాన్నీ తేలికగా తీసుకోవటం అలవాటు చేసుకో! టెన్షన్ డెవలప్ చేసుకోకు! అది ఆరోగ్యాన్ని చెరుపుతుంది... బీ హేపీ విత్ యువర్ లైఫ్ పార్టనర్... నేను లోకల్‌గానే వుంటాను గనుక... నీకు వీలున్నప్పుడల్లా వచ్చి చూచిపోతూండు! చనిపోయాక నా పార్థివ శరీరానికి జరగాల్సిన కర్మకాండ మాత్రం జరిపించు...' కళ్ళొత్తుకున్నాడు నందనరావ్.

ఆ క్షణంలో మనసున్న బండరాయిగా మారిన భరత్ ఏం మాట్లాడటానికీ నోరు పెగల్లేదు.

- సమాప్తం -